సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 52 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 06.06.2025




## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అర్హులైన లబ్దిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గురువారం జాఫర్‌గఢ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి పాల్గొన్నారు.

- మన చౌరాస్తా, జాఫర్‌గఢ్

2 లో



## మంత్రి కొండా సురేఖకు స్వల్ప అస్వస్థత

- కేబినేట్ భేటీకి వెళుతుండగా ఘటన

**హైదరాబాద్, మన చౌరాస్తా:** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సచివాలయంలో మంత్రి కళ్లు తిరిగి పడిపోయారు. ఉదయం నుంచి ఆహారం తీసుకోకపోవడంతో ఆమె పడిపోయారు. ఏమి తినకపోవడంతోనే మంత్రికి షుగర్ లెవెల్స్ తేడా వచ్చాయి. వెంటనే మంత్రి సురేఖ వ్యక్తిగత సిబ్బంది అప్రమత్తమయ్యారు. మంత్రి సురేఖకు వ్యక్తిగత సిబ్బంది ఆహారం తెచ్చిఇచ్చారు. ఆహారం తీసుకోవడంతో మళ్లీ తేరుకున్నారు. కొండా సురేఖ కేబినేట్ సమావేశానికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొనడానికి మంత్రులు వచ్చారు. ఈ క్రమంలోనే కొండా సురేఖ అస్వస్థతకు గురయ్యారు. సచివాలయంలో అస్వస్థతకు గురైన మంత్రి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై సీఎం, మంత్రులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో కేబినెట్ సమావేశం ప్రారంభమైంది.

## సాక్షి ములుగు స్టాఫ్ రిపోర్టర్ సునీల్ హఠాన్మరణం

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి సీతక్క

**ములుగు, మన చౌరాస్తా :** ములుగు మండలం కోడిశాల కుంట గ్రామానికి చెందిన ములుగు జిల్లా సాక్షి స్టాఫ్ రిపోర్టర్ భూక్యా సునీల్ హఠాన్మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం వ్యక్తం చేశారు. మృదు స్వభావం కలిగిన వ్యక్తి అందరితో ఆప్యాయంగా ఉంటూ తన వృత్తికి వన్నె తెస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే వాడాని ఆయన అకాల మరణం తమను ఎంతో కలిచివేసిందన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మళ్లీ మునపటి లాగా అందరిలో కలిసి తిరుగుతున్న సునీల్ ఇలా అనుకోకుండా మరణించడం బాధాకరమన్నారు. ఆయన మరణం పత్రిక రంగానికి మాకు తీరని లోటన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.









# భూభారతి చట్టం రైతులకు వరం

## కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**చిల్పూర్, మన చౌరాస్తా :** ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి (ఆర్ఓఆర్) రికార్డ్స్ ఆఫ్ రైట్స్ యాక్ట్ ప్రవేశపెట్టడం జరిగిందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కోరారు. గురువారం జాఫర్‌గఢ్ మండలంలోని కోనాయిచలం, చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాలలలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను ఆర్డీవో తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడారు. భూభారతి విశిష్టతను తెలియజేశారు. హెల్ప్ డెస్కుని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తులను నింపడంలో పొరపాట్లు చేయరాదని చెప్పారు. అధికారులు కూడా సంబంధిత లబ్ధిదారులతో ముందుగా మాట్లాడాలని, వారి సమస్యలు తెలుసుకోవాలని, తద్వారా పరిష్కరించడం సులభతర మవుతుందన్నారు. రికార్డులలో ఉన్న తప్పులను సరి చేయడం జరుగుతుందని లబ్ధిదారులు కూడా సహనం పాటించాలన్నారు. భూభారతిలో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అందుకు కావలసిన పత్రాలను కూడా సమర్పించాలన్నారు. ఏమైనా సందేహాలు, అపోహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ డీఎస్ వెంకన్న, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జాఫర్‌గఢ్, మన చౌరాస్తా :** అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గురువారం జాఫర్‌గఢ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే మహిళలకు బ్యాంకు లింకేజీ కింద 4.86 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ నిలువ నీడను కల్పించాలని గొప్ప ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టిందన్నారు. దశలవారీగా లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతా యన్నారు. అలాగే జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కింద గ్రామీణ వికాస్ బ్యాంక్ అందించిన బ్యాంకు లింకేజీని మహిళలు వివిధ వ్యాపార రంగాలలో పెట్టుబడులు పెడుతూ సాధికారత సాధించాలన్నారు. మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోవాలన్నారు. నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే ఆరోగ్యంగా ఉంటామని పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోగలుగుతామన్నారు.
కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునే వారు ఇంటి నిర్మాణ సామాగ్రిని ఒకేసారి కొనుగోలు చేస్తే ఖర్చు తగ్గించుకోవచ్చు అన్నారు. అదేవిధంగా ఇంటి నిర్మాణంలో కావలసిన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందున ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. బేస్మెంట్ కట్టుకున్న వారికి లక్ష రూపాయలు లెంటల్ లెవెల్ వరకు నిర్మించుకున్న వారికి మరో లక్ష రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఈ విధంగా మొత్తంగా ప్రతి ఇంటికి ఐదు లక్షలు అందుతాయన్నారు. మేస్త్రీలను కూడా స్థానికంగా ఆయా గ్రామంలో ఉన్నవారినే ఎంపిక చేసుకుంటే ఖర్చు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరూ వర్షపు నీరు భూమిలోకి వెళ్లే విధంగా ఇంకుడు గుంత నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోడీ ఎస్.వెంకన్న పశుసంవర్ధక శాఖ అధికారి రాధా కిషన్ పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన తాటికొండ

**జనగామ, మన చౌరాస్తా :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ సోషల్ వాయిస్ ఫౌండేషన్ మొదటి కార్యక్రమం మొక్క నాటి ప్రయాణించడం ఎంతో సంతోషదాయకం అన్నారు. మంగళంపల్లి రాజు సారధ్యంలో ఫౌండేషన్ గొప్పగా ఏదుగుతుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాగ్యలక్ష్మి, ఎన్ఎంఆర్ గార్డెన్స్ చైర్మన్ రాంరెడ్డి, కర్ణాకర్, వివిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నల్లా రాహుల్, జేఏసీ నాయకులు తుంగ కౌశిక్, శ్రీహరి, చిటుకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.






# సన్న బియ్యం పంపిణీలో జాప్యం వద్దు

## అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం అందించాలని సంకల్పాన్ని నెరవేర్చేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ ఆదేశించారు. గురువారం సన్న బియ్యం పంపిణీ పై అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ జనగామ పట్టణంలోని 2 నిత్యవసర దుకాణాలను సందర్శించి పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలల సన్న బియ్యం జూన్ నెలలోనే సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున అధికారులు సన్న బియ్యం పంపిణీలో జాప్యం చేయరాదని వేగవంతం చేయాలన్నారు. మండల స్టాక్ పాయింట్లను కూడా సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. సన్న బియ్యం పంపిణీ లో జాప్యం తగదని వేగవంతంగా చేపట్టాలన్నారు.



# చేర్యాల మున్సిపాలిటీలో పరిశుభ్రత కార్యక్రమాలు

**చేర్యాల, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ పరిధిలోని 2, 3, 4, 5, 12వ వార్డులలో తడి పొడి చెత్త మీద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చేర్యాల పెద్ద చెరువు కట్టపై మొక్కలను నాటారు. అదేవిధంగా 12వ వార్డులో శానిటేషన్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చేర్యాల మున్సిపల్ కమిషనర్ నాగేందర్, ఆర్ఐ కృష్ణ, మెప్మా ఇంచార్జి రాజు, 12వ వార్డు ఆఫీసర్ మహేజియా సుల్తానా, భావన ఋషి, మేనేజర్ ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని జనగామ ఆర్డీవో గోపిరామ్ అన్నారు. గురువారం బచ్చన్నపేట మండలంలోని కేసిరెడ్డిపల్లిలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. స్థానికంగా ఉన్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో స్వీకరిస్తున్న అర్జీలను పరిశీలించి నాయబ్ తహశీల్దార్ ఫణి కిషోర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... భూభారతిలో భాగంగా తెలంగాణలోని అన్నిగ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు.



దరఖాస్తులను ఆన్ లైన్‌లో పొందుపరుస్తామని, అనంతరం అధికారులు దరఖాస్తులను పరిశీలించి సమస్యలకు పరిష్కారం ఇచ్చేలా కృషి చేస్తారన్నారు. ఏవైనా రెవెన్యూ రికార్డుల్లో పేరు భూమి వివరాలు మార్పులు చేర్పు లాంటివి సరి చేసుకోవాలని, రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ఇచ్చిన ప్రతి దరఖాస్తును రికార్డులో నమోదు చేసుకొని వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి, తదుపరి సమస్యల పరిష్కారానికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు తప్పనిసరిగా భూమికి సంబంధించిన కాగితాలు కలిగి ఉంటే సులభంగా పట్టా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ఫణి కిషోర్, గిర్దవర్ వంశీకృష్ణ, ఏఆర్ఐ మునవర్, సీనియర్ అసిస్టెంట్ షఫీ, జూనియర్ అసిస్టెంట్ యకన్న పాల్గొన్నారు.





# వనమహోత్సవాన్ని విస్తృతంగా చేపట్టాలి

## జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :**

వనమహోత్సవాన్ని విస్తృతంగా చేపట్టి నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వం నిర్దేశించిన 30 లక్షలు 50 వేల మొక్కలు నాటేందుకు వనమహోత్సవం లక్ష్యాలను అదేవిధంగా జల శక్తి అభియాన్, సీజనల్ వ్యాధులు వంటి పలు అంశాలపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పింకేష్ కుమార్ తోకలిసి సంబంధిత అధికారులతోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఆయా శాఖల వారీగా లక్ష్యాలు రూపొందించుకొని రోజువారి నివేదిక అందించాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు, హాస్టల్స్, స్కూల్స్ , గ్రంథాలయాలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు పశు వైద్య కేంద్రాలు ప్రభుత్వ భవనాలు, రైతు వేదికలు, అంగన్వాడి కేంద్రాలలో తప్పనిసరిగా మొక్కలను నాటించాలన్నారు. అలాగే పంచాయతీ రాజ్ రహదారులు రోడ్లు భవనాల శాఖ రహదారులు వెంట అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. అదేవిధంగా ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేపట్టాలని, ప్రతి మొక్క వివరాలు రిజిస్టర్లో నమోదై ఉండాలన్నారు. జాతీయ కుటుంబ లబ్ది పథకం పై గ్రామ సభలలో తెలియచెప్పాలని 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరంలలోపు చనిపోయిన వారి వివరాలు సేకరించాలన్నారు. సంపాదించే కుటుంబం పెద్దను కోల్పోతే ఆ కుటుంబం కష్టాల పాలు కాకూడదన్నది జాతీయ కుటుంబ లబ్ది పథకం యొక్క లక్ష్యం అన్నారు. నిధులు సమృద్ధిగా ఉన్నందున అర్హులైన పేదలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జల శక్తి అభియాన్ లక్ష్యాలను సాధించాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటివి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో మాధురి షా, డీఆర్డిఏ పీడీ వసంత, డీపీవో స్వరూప, డీఎం అండ్ హెచ్‌వో మల్లికార్జున రావు, డీఏవో రామారావు నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి రాధా కిషన్, ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఎక్సైజ్ శాఖ అధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

చేర్యాల, మన చౌరాస్తా : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మండలంలోని పోతిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి పల్లె రజిత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పెళ్లిళ్లకు సైతం ఇస్తారాకుల భోజనం అందించాలని సూచించారు. చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.





# పర్యావరణాన్ని పరిరక్షించాలి

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందిరిపై ఉందని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌తో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హితం కోసం పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు, పెళ్లి రోజు, వివిధ పండుగలు, శుభకార్యాల్లో ఒక మొక్కను నాటడం అలవాటుగా పెట్టుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం సందర్శించి మున్సిపల్ కమిషనర్‌తో కలిసి అధికారులు, సిబ్బందితో కార్యకలాపాలను సమీక్షించారు. విధులకు సకాలంలో హాజరుకావాలన్నారు. నిర్ణీత సమయంలో పన్నుల వసూళ్లు జరగాలన్నారు. నిరంతరం తాగునీటిని క్లోరినేషన్ చేస్తూ సరఫరా సజావుగా కొనసాగాలన్నారు. మురుగు కాలువలను శుభ్రపరచాలని, మురికివాడలలో ప్రాధాన్యత నిస్తూ పారిశుద్ధ్యం మెరుగు పరుస్తూ బ్లీచింగ్ చేయించాలన్నారు. ఎల్లవేళలా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వీధి లైట్లు లేనిచోట ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తే రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. రిజిస్టర్ల నిర్వహణ చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** దేవరుప్పుల మండల బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు గంగారపు అరుణ్ కుమార్ చెల్లి వివాహం ఆలేరులోని ఒక పంక్షన్ లో జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ జనగామ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, దేవరుప్పుల మండల అధ్యక్షుడు తీగల దయాకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బస్వ మల్లేష్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమన్న, బీఆర్ఎస్ నాయకులు ఎలా సుందర్, రామ్ సింగ్, చింత రవి, జోగు సోమనర్సయ్య, కోతి ప్రవీణ్, బోనగిరి యాకన్న, మేడ విద్య సాగర్, రంగయ్య, వడ్లకొండ వినయ్, బానోతు రాజన్న, గుగులోతు పవన్, మహేష్ యాదవ్, సామ్రాట్ , చింత మహేష్ ఉన్నారు.

# పళని మురుగన్ సన్నిధిలో సూర్య



కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య పళని మురుగన్ ఆలయాన్ని దర్శించుకున్నాడు. గురువారం ఉదయం పళనికి వెళ్లిన సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత నాగవంశీ మురుగన్‌ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకముందు సూర్య రాకతో ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. రెట్రో సినిమా తర్వాత సూర్య తన తదుపరి చిత్రం వెంకీ అట్లూరితో చేస్తున్న విషయం తెలిసిందే. 'సూర్య 46 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. ఈ సందర్భంగానే సూర్య స్వామివారి ఆశీస్సులు తీసుకోవడానికి ఆలయాన్ని సందర్శించినట్లు తెలుస్తోంది. ఆలయానికి వచ్చిన సూర్య క్లీన్ షేవ్‌లో కనిపించడంతో ఆయన లుక్ వైరల్‌గా మారింది. సూర్య 46 షూటింగ్ జూన్ 9న స్టార్ట్ కాబోతున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో సూర్య సరసన మమితా బైజు కథానాయికగా నటిస్తున్నారు. అంతేకాకుండా, రవీనా టాండన్ మరియు రాధిక కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



# అనుష్క వేదం పోస్టర్ వైరల్



టాలీవుడ్ గోల్డెన్ లెగ్ అనుష్క గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. మామూలుగా ఒక హీరోయిన్ కెరీర్ మహా అయితే పదేళ్లు ఉంటుంది. గట్టిగా నిలుపుకుంటే మరో 5 ఏళ్లు వేసుకున్న 15 ఏళ్లు. కానీ.. అనుష్క మాత్రం దాదాపు రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో ఉంది. ఉండటమే కాదు.. ఇప్పటికీ అంతే క్రేజ్.సరిగ్గా 2005లో 'సూపర్' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి.. ఫస్ట్ సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత మళ్లీ అనుష్క వెనక్కి తిరిగి చూసుకోలేదు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో హిట్ల మీద హిట్లు కొడుతూ తిరుగులేని క్రేజ్ సంపాదించుకుంది. అయితే కెరీర్ పీక్స్‌లో ఉండగా పాత్రల విషయంలో హీరోయిన్‌లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ అనుష్క తన కెరీర్‌లో కొన్ని రిస్కీ పాత్రలు కూడా చేసింది. అందులో ఆమె 'వేదం' చిత్రంలో చేసిన వేశ్య పాత్ర ఒకటి. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన ఈ సినిమా రిలీజ్ అయి 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. దీంతో రీసెంట్ ఈ మూవీ రిలీజ్ టైంలో జరిగిన సంఘటన ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అయితే వేదం సినిమా ప్రమోషన్ కోసం అనుష్క పసుపు చీర కట్టుకొని వెనక్కి తిరిగి చూస్తున్న స్టిల్స్ తెగ వాడేశారు. పలు చోట్ల హోర్డింగ్ కూడా పెట్టారు. అయితే పంజాగుట్ట సర్కిల్ లో కూడా అనుష్క వెనక్కి తిరిగి చూస్తున్న ఫొటోని చాలా పెద్దగా పెట్టారట. అయితే అనుష్కని చూస్తూ వాహనదారులు యాక్సిడెంట్ల బారిన పడడం అప్పట్లో చర్చనీయాంశం అయింది. దాదాపు 40 మైనర్ యాక్సిడెంట్స్ జరగడంతో పోలీసులు ఏఐఈ అధికారులతో కలిసి అనుష్క హోర్డింగ్ ని తొలగించారట. ప్రజంట్ ఈ న్యూస్ తెగ వైరల్ అవుతుంది.



# హరిహర వీర మల్లు మళ్లీ వాయిదా?

ఈ నెల 12న రావాల్సిన 'హరిహర వీర మల్లు' వాయిదా పడినట్టే కనిపిస్తోంది! విజువల్ ఎఫెక్ట్స్ పనులు పూర్తి కాకపోవడంతో మరోమారు సినిమాని వాయిదా వేయాలని నిర్ణయించారు. కొత్త తేదీ ఖరారుపై ప్రస్తుతం చిత్రబృందం కసరత్తులు చేస్తోంది. వచ్చే నెలలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తేదీపై స్పష్టత వచ్చిన వెంటనే చిత్రబృందం అధికారికంగా ప్రకటించనుంది. ఐదేళ్ల కిందట మొదలైన ఈ సినిమా, సుదీర్ఘకాలం సెట్స్‌పైనే ఉంది. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. 12న విడుదల చేయాలని నిర్ణయించిన చిత్రబృందం, ఆ మేరకు ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించింది. అయితే . పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. నిధి అగర్వాల్ కథానాయిక. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఎ. ఎమ్.రత్నం సమర్పకులు. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ చిత్రానికి కీరవాణి స్వరకర్త. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఓజీ' చిత్రీకరణ వడివడిగా సాగుతోంది. ఇటీవలే ముంబయి షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురువారం నుంచి విజయవాడలో చిత్రీకరణ చేసుకోనుంది. ఈ షెడ్యూల్‌తోనే సినిమా పూర్తి కానున్నట్టు సమాచారం. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు ఇటీవలే నిర్మాత అధికారికంగా ప్రకటించారు.